# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- ❖ మైనారిటీల సంక్షేమం కోసం గుంటూరులో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.
- ❖ పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కోసం ప్రమాద, ఆరోగ్య బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ఈరోజు లాంఛనంగా ప్రారంభించారు.
- ❖ ఎన్డియే కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.

=====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ఈరోజు కాకినాడ జిల్లా పెద్దాపురంలో జరిగిన స్వచ్ఛతా ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం అక్కడి మ్యాజిక్ డ్రెయిన్లను పరిశీలించిన ముఖ్యమంత్రి వాటి నిర్మాణం, ఉపయోగం గురించి పారిశుద్ధ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ప్రజా వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అంగళ్ళను పరిశీలించారు. సర్క్యులర్ ఎకానమీలో భాగంగా రీ-సైక్లింగ్ ఉత్పత్తుల సంస్థలను ప్రోత్సహించాలని సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అంటు వ్యాధులకు ప్రధాన కారణం అపరిశుభ్రత అని చెప్పారు. చెత్త నుంచి సంపద సృష్టించవచ్చని, ఈ-వేస్ట్‌ను రీసైక్లింగ్‌కు పంపేలా ఆలోచనలు చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 33 సెకన్లు)

=====================

అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం కోసం పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఈరోజు ఆయన గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు నజీర్ అహమ్మద్‌తో కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ.. పీఎం జన్ వికాస్ కార్యక్రమం, పీఎం సూర్య ఘర్ పథకాల అమలుపై చర్చించామన్నారు. పీఎం జన్ వికాస్ మైనారిటీలకు సంబంధించిన కార్యక్రమమని, దీని అమలుకు గుంటూరులో పలు ప్రాంతాలు ఎంపికయ్యాయని వెల్లడించారు. పీ.ఎం.జె.వి.కె కింద వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

పారిశుధ్య కార్మికుల సంక్షేమం కోసం ప్రమాద, ఆరోగ్య బీమా పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు లాంఛనంగా ప్రారంభించారు. పట్టణాభివృద్ధి శాఖ - యాక్సిస్ బ్యాంక్ సంయుక్తంగా ఈ స్కీంను అమలు చేసేలా ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఇప్పటికే మున్సిపల్ కార్మికుల శాలరీ ప్యాకేజ్ ఖాతాలు ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 55 వేల 686 మంది కార్మికులకు బీమా సదుపాయం లభించనుంది. వీరిలో 39 వేల 170 మంది పబ్లిక్ హెల్త్ విభాగంలో ఉండగా, 16 వేల 516 మంది ఇతర విభాగాల్లో పని చేస్తున్నారు. వీరిలో శాశ్వత, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న వారందరికీ ఈ పథకం వర్తించనుంది.

======================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం, శోభనాపురం గ్రామంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి గ్రామం, పట్టణం పరిశుభ్రంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ద్వారా పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే కాకుండా, రహదారులు, నీటి వసతి, విద్య, ఆరోగ్యం తదితర రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళుతున్నామని చెప్పారు.

======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈ నెల 29వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

విరామం

======================

రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర, కృష్ణా జిల్లా కలెక్టర్ డి. కె. బాలాజీ ఈరోజు పెద్ద పోతేపల్లి గ్రామం ఎంపీపీ పాఠశాల వద్ద జరిగిన స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర.. కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వచ్ఛభారత్ స్ఫూర్తిగా మచిలీపట్నాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 2 కోట్ల రూపాయల ఖర్చుతో పార్కులు, ప్రధాన రహదారుల వెంట సుందరీకరణ కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్లాస్టిక్ రహిత వ్యర్థాలను సేకరించి రీసైకిల్ నిర్వహిస్తున్నామని పేర్కొంటూ.. ప్రజలు పాలిథిన్ బ్యాగులు, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని మంత్రి ఈ సంర్భంగా సూచించారు.

======================

రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఈరోజు పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం లంక గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వరద సమయంలో కనకాయ లంక కాజ్ వే ముంపుతో రాకపోకలు నిలిచిపోతున్నాయని, ఈ సమస్యను శాశ్వతంగా నిర్మూలించేలా 23 కోట్ల రూపాయలతో ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. వర్షాలు, వరదల సమయంలో ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేస్తూ.. నష్ట నివారణకు కృషి చేస్తున్నామని చెప్పారు. వరద తగ్గుతోందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. వరద ముంపు బాధిత గృహాలను గుర్తించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి వెల్లడించారు.

=====================

స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతిని పురస్కరించుకుని అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈరోజు ఘనంగా వేడుకలు నిర్వహించారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

=====================

ఖైదీలు చక్కటి నడవడిక, నైతిక విలువలను అలవర్చుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని పార్వతీపురం మన్యం జిల్లా అదనపు న్యాయమూర్తి జె. సౌమ్య జోసెఫిన్ తెలిపారు. ఈరోజు పార్వతీపురం సబ్ జైల్ ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి వసతులను పరిశీలించారు.

=====================

కెనడాలో ఈ నెల 17 నుంచి జరుగుతున్న వరల్డ్ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్ లో భారత జట్టు అద్భుత ప్రతిభను కనబరిచిందని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ ఎ. రవినాయుడు అన్నారు. అండర్-21 కాంపౌండ్ టీమ్ విభాగంలో స్వర్ణ పతకాలు సాధించిన భారత ఆర్చర్లకు ఆయన అభినందనలు తెలిపారు. రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ ఆర్చర్ గణేష్ మణిరత్నం స్వర్ణ పతకం సాధించడం హర్షణీయమని ఆయన అన్నారు.

=====================

పశ్చిమ బెంగాల్, పరిసర ప్రాంతాలలో ఈరోజు ఉదయం ఏర్పడిన అల్పపీడనం అదే ప్రాంతంలో కొనసాగుతోంది. దీనికి సంబంధించిన ఉపరితల ఆవర్తనం.. సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశగా కదిలి క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. అలాగే.. రాష్ట్రంలోని దిగువ ట్రోపో ఆవరణంలో వీస్తున్న నైరుతి, పశ్చిమ గాలుల ఫలితంగా కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఒకటి, రెండు చోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకటరావు పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

=====================

=====================